కథా నిలయం
4553
శ్రీకాకుళం



"ఈ సూట్ కేస్ మీదేనా?"

కోమలమయిన స్వరం విని తల తిప్పి చూశాను.

అవతల సీటువద్ద నిలబడి ప్రశ్నార్థకంగా నావంక చూస్తూంది. చాలా అందంగా, నాజూగా ఉందామె. క్షణంసేపు తడబడి, గొంతు సవరించుకుని, "నాదే" అంటూ ఆమెకు అడ్డంగా ఉన్న సూట్ కేస్ తీసి నా దగ్గరగా పెట్టుకున్నాను.

లైసెన్సు కూలీ సీటు దగ్గర సామానులు దించి ఆమె ఇచ్చిన

రూపాయి నోటు తీసుకుని వెళ్ళిపోయాడు. ఆమె తన బాగ్‌లోంచి దుప్పటి తీసి కూర్చునే సీటుమీద పొందికగా పరచింది.

తరువాత సామాను సీటుకింద సర్ది రుమాలుతో ముఖం ఒత్తుకుంటూ కూర్చుంది.

రెండు నిముషాల నిశ్శబ్దం తరువాత "మీ పేరు కృష్ణకుమార్! అవునా?" అంది నావంక తిరిగి.

నా చేతిలోని పుస్తకం జారిపడినంత పనయింది! విస్మయంగా "మీ కెలా తెలుసు?" అన్నాను. నా కెందుకో ఆమె ముఖం పరిచయమయిన దిగా అనిపించింది. కాని గుర్తుకు రాలేదు. "ఆమెతో ఎలా మాటలు కలపాలా?" అని ఆలోచిస్తున్న నాకు ఆమే స్వయంగా ఆధారం కల్పించింది. పద్నాలుగు గంటల ప్రయాణానికి ఇంత మంచి సాహచర్యం లభించినందుకు మనసు అవ్యక్తమయిన ఆనందంతో నిండిపోయింది.

ఆమె మవునంగా ఉండిపోతే నేనే అన్నాను- "మనం ఇంతకు ముందు ఎక్కడో కలుసుకున్నాం."

"మనం ఎక్కడా కలుసుకోలేదు!" అంది ఖచ్చితంగా. మాట ఖచ్చితంగా ఉన్నా ముఖంలో మాత్రం ఎంతో ప్రసన్నత కనిపించింది.

"మరి నా పేరు మీ కెలా తెలిసింది?"

"ఇడిగో, నా ఇవతలి సీటులోకి వచ్చే ఆయన వరదరాజ అయ్యంగార్! ఆయన నమిలే కారాకిళ్ళీ వాసన నేను భరించాలి! ఎదుటి సీట్లలోకి కేస్కర్ అండ్ ఫామిలీ వస్తారు. వీళ్ళందరికీ బహుశా తెలుగురాదు. మనిద్దరమే కబుర్లు చెప్పుకోవాలి హైద్రాబాద్ వరకూ" అంది.

"నా బుర్రలో ట్యూబులైట్ వెలిగింది.

"బోగీకి అంటించిన రిజర్వేషన్ లిస్టు చూసి వచ్చారు మీరు! ఐనా వరదరాజ అయ్యంగారికి కారాకిళ్ళీ అలవాటు ఉందని రైల్వేవాళ్ళు చార్టులో రాయరు కదా! మరి మీకెలా తెలుసు?" అన్నాను సంభాషణ పొడిగిస్తూ.

ఆమె తమాషాగా నవ్వింది!

"మా పిన్ని కొడుకు టికెట్ రిజర్వ్ చేయటానికి వచ్చాడు. ఆ దినం "క్యూ"లో వాడి వెనక నిలబడి ఈ అయ్యంగార్ తమిళంలో ఎవడికో సుత్తి వేస్తున్నాడట! మాట్లాడుతూ వుంటే ఆ కారాకిళ్ళీ తుంపరలు మావాడి తెల్లచొక్కా నిండా పడ్డాయి. ఇంటికివచ్చి పావుగంటసేపు ఈ విషయం గురించి చెప్పాడు మా తమ్ముడు!" అంది.

అంతలోనే సదరు అయ్యంగార్ సామానుతో వచ్చారు. బుగ్గన కారాకిళ్ళీ; చేతిలో పెద్ద సూట్‌కేస్; భుజానికో పెద్ద లెదరుబాగు ఉంది! "కేస్కర్ అండ్ ఫామిలీ" కూడా ఆ వెనకే వచ్చారు.

"నంబరు ఏడు. వాల్తేరు నుండి హైదరాబాద్ పోవు గోదావరి ఎక్స్‌ప్రెస్ ఒకటో నంబరు ప్లాట్‌ఫారం నుండి అయిదు నిమిషాలలో బయలుదేరును" అనే తెలుగు హెచ్చరిక కొంతవరకూ అర్థమయింది.

"మీ దగ్గర మంచినీళ్ళు వున్నాయా?" మెల్లగా అడిగింది ఆమె.

"లేవు" అన్నాను. "మంచినీళ్ళ సీసాకూడా లేకపోయిన ఈ బతుకు ఎంత వ్యర్థం?" అనిపించింది ఆ క్షణంలో.

"మరి దారిలో దాహంవేస్తే ఏం చేస్తారు?" అని అడిగింది.

"నాకు దారిలో దాహం వెయ్యదు" అన్నాను. ఆ మాటలుఅంటూ ఉంటే గొంతు ఎండారిపోయింది. గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీళ్ళు ఉంటే బాగుండుననిపించింది.

"పులిహోర తింటూ ఉంటే పంటికింద మిరపకాయ ముక్క పడుతుంది కదా—మరి. అప్పుడేం చేస్తారు? అంది మళ్ళీ! ఈసారి ఆమె గొంతులో కొంటెతనం ధ్వనించింది.

"పులిహోర నా దగ్గర లేదుగా!" అన్నాను బింకంగా.

"నా దగ్గర ఉందికదా! అందుకని సరే! మీరు నా సామానుచూస్తూ ఉండండి. వాటర్ బాటిల్ నిండా నీరు నింపుకుని వస్తాను!" అంటూ లేవబోయింది. వెంటనే కర్తవ్యం స్ఫురించింది నాకు!

"ఆగండి! మీరు వెళ్ళొద్దు! రైలు బయలుదేరే వేళవుతూంది. నేను వెళ్ళి పట్టుకొస్తాను" అంటూ చొరవగా ఆమె చేతిలోని బాటిలు అందు కున్నాను.

"వాటర్ బాటిల్" నింపి కదులుతున్న రైలు ఎక్కవలసి వచ్చింది.

"ఆ ఎదుటి కుళాయి దగ్గర పట్టకపోయారా? దూరం ఎందుకు వెళ్ళారు?" అంది ఆమె నా చేతిలోని "బాటిల్" అందుకుంటూ. నాకు శ్రమ కలిగించినందుకు ఎంతో నొచ్చుకుంటున్నట్లు మాట్లాడింది.

"అతి చల్లని మంచినీరు పట్టుకొద్దామని వెళ్ళాను! అక్కడి నీళ్ళు మరింత వేడిగా ఉన్నాయి.

కంపార్టుమెంటు అవతలి చివరకు వెళ్ళి లిస్టులో ఆమె పేరు చూసి వచ్చాను. ఆ సంగతి ఆమెకు చెప్పటం నాకు ఇష్టం లేకపోయింది.

రైలు వేగం పుంజుకుంటూంది.

అయ్యంగారు సంచీలోంచి బుల్లి స్టీలుబాక్సుతీసి మరో కారాకిళ్ళీ తయారుచేయడంలో నిమగ్నమయాడు.

ఆమె దుప్పటి నా సీటువరకూ వచ్చేలా సర్దిపరిచింది. సీటుకింద ఉన్న పేము బుట్టలోంచి రెండు మేగజైన్లు తీసి బయట పడేసింది.

నేను గొంతు సవరించుకొని "చూడండి లక్ష్మీనరసమ్మగారూ!" అంటూ సంభాషణ ఆరంభించబోయాను. ఎందుకో ఆ పేరుని మూర్ఖంగా పలకలేకపోయాను. ఇంత అందమైన అమ్మాయికి అంత్యమోటుపేరు తగిల్చిన ఆ తల్లితండ్రుల్ని క్షమించటానికి నా మనసు అంగీకరించ లేదు.

ఆమె గాలికి ఎగురుతున్న తన పట్టుచీరని ఒద్దికగా సర్దుకుంటూ క్షణంసేపు నావంక ఆశ్చర్యంగా చూసి తరవాత పెదాలు బిగించి నవ్వుని కనుల వెనక ప్రతిఫలింపజేసింది. కనులు నవ్వటం అంటే ఏమిటో ఇన్నాళ్ళకు అర్థమయింది నాకు. ఆ కనుల వెనక ఎంత వెలుగు?

రెండు క్షణాల తరవాత ఇక అణిచిపెట్టుకోలేక బయటకు నవ్వేసింది.

అలా నవ్వుతూ ఉంటే పెదాలు రెండూ గీతల్లా విడి అందమయిన పలువరుస బయటకు తొంగిచూసింది. అప్పుడు ఆమెను మరింత శ్రద్ధగా గమనించాను.

గోధుమరంగు ఒంటి ఛాయ....శంఖం లాంటి మెడ—గ్లాసుతో నీళ్ళు ఎత్తి పోసుకుంటే కంఠంలోంచి లోనికి జారటం స్పష్టంగా కనపడుతుందేమో—వెడల్పాటి కనులకు కనబడకుండా "కాటుక" దిద్దింది. చీరకు మేచ్ అయ్యేలా బచ్చలిపండురంగు బొట్టు పెట్టుకుంది. మెడలో పలచని బుట్ట గొలుసు—గొలుసుచివర లాకెట్ ఉందో, లేదో తెలీదు. గుండెమీదకు జారి జాకెట్టులో ఒదిగిపోయింది. చెవులకు ముత్యాలు, కెంపు వర్ణం రాళ్ళు అమర్చిన దిద్దులు పెట్టుకుంది. చీర ఒంటికి అతికేలా అందముగా కట్టుకుంది. వయస్సు సుమారు ఇరవైరెండేళ్ళు ఉంటాయేమో! వయసు నిర్ధారణ ఖచ్చితంగా చేయలేని లేతదనం ఆమెలో స్పష్టంగా గోచరిస్తూంది. ఎక్కువసేపు గుచ్చిచూస్తే బాగుండదని నా చూపులు మరల్చుకుంటూ "ఎందుకలా నవ్వుతారు?" అని అడిగాను.

ఆమె తన నవ్వుకు బలవంతంగా ఆనకట్ట వేస్తూ "మీ తెలివితేటలకు జోహార్లు! నీళ్ళకని అవతలి చివరి వరకూ వెళ్ళి మీరు సాధించి వచ్చింది ఇదా? నా పేరు అడిగితే చెప్పననుకున్నారా? లక్ష్మీనరసమ్మ మా పిన్ని పేరు. రైల్వే రూల్సుకు విరుద్ధంగా ఆమె పేరుమీద నేను ప్రయాణం చేస్తున్నాను కాదు, చేయాల్సి వచ్చింది! నా పేరు కవిత!" అంది.

నా తెలివితేటలు ఈ రకంగా తేలిపోయినందుకు క్షణం సేపు బాధ కలిగినా, ఆమె పేరు కవిత అని తెలుసుకున్నందులకు మాత్రం ఆనందం కలిగింది.

నా అజ్ఞానం కప్పుకునేందుకు ఒక వెర్రినవ్వు ముఖానికి పులుముకుని, కిటికీపైపు తిరిగి కదిలిపోయే దృశ్యాలవంక చూస్తూ ఉండిపోయాను.

ఫ్యాక్టరీలు కనుచూపుకు మెల్లగా దూరమైపోతున్నాయి. పెద్దగా రొదచేస్తూ ఒక హెలికాప్టర్ "హెలీపాడ్" మీద దిగే ప్రయత్నం చేస్తూంది.

"ఇలా చూడండి!" అంది కవిత నా ఏకాగ్రతను భంగం చేస్తూ!

"ఇదిగో! ఈ బత్తాయిపండులో ఎన్నితొనలుంటాయి?" అడిగింది. పండుని కుడి అరచేతిలో వుంచి దానిచుట్టూ అయిదువేళ్ళు ముడుచుకున్న కలువ రేకుల్లా కప్పింది.

"ఏమో! అదెలా తెలుస్తుంది?" అన్నాను కుతూహలంగా ఆమె వంక చూస్తూ.

"నేను చెప్పనా?"

"చెప్పండి!" అన్నాను.

"తొమ్మిది!" అంది.

"ఎలా చెప్పగలరు?" ఆమె ఖచ్చితంగా చెబుతూవుంటే నా కుతూహలం మరింత పెరిగింది.

"ప్రతి బత్తాయి పండులోనూ తొమ్మిది తొనలే వుంటాయి. కావలిస్తే ఎన్ని పళ్ళయినా "చెక్" చేసుకోండి" అంది

జ్వరం వస్తే బత్తాయి పళ్ళరసం తాగడం తప్ప తొనలు ఒలుచుకుని లెక్కపెట్టి తిన్నగుర్తు లేదు నాకు! అయినా రాజీకి రావటం ఇష్టంలేక "అలాగ రూలు ఏమీలేదు. ఎన్ని తొనలయినా వుండవచ్చు" అన్నాడు బుకాయింపు ధోరణిలో.

"కాదు! ఖచ్చితంగా తొమ్మిదే ఉంటాయి." అంటూ ఏదో నిశ్చయానికి వచ్చినదానికిమల్లే సీటులోంచి లేచి కిటికీ వద్దకు వచ్చినా పక్కగా నిలబడి చకచకా పండు వలిచింది. ఆమె రాసుకున్న శాండల్ పౌడరు వాసన నన్ను కమ్మేసినట్లయింది!

తొక్కలు అవతల గిరాటేసి పండుపై వున్న తెల్లపొరను చాకుతో తమాషాగా తొలగించింది. సన్నని నాజూకయిన వేళ్ళు ముచ్చటగా ఆ పండుమీద కదులుతూ వుంటే చూడటానికి తమాషా అనిపించింది.

"లెక్క పెట్టండి!" అంటూ పండు నా చేతికి అందించింది.

ఆశ్చర్యం! సరిగ్గా తొమ్మిదే వున్నాయి!

ఆమె తెలివితేటలకు పరిశీలనా శక్తికి మనసులోనే జోహారు లర్పించాను.

పండు నా చేతిలోంచి తీసుకుని మధ్యకు చెక్కలా చీల్చి కొన్ని తొనలు నాకు అందించింది. తొనలు తీసుకుంటూ కావాలని నా చేతి వేళ్ళు ఆమె వేళ్ళకు తాకించాను.

నరాలు జివ్వుమన్నాయి!

"నేను బాటనీ బి. ఎస్‌సి. ఈ మధ్యనే పూర్తి చేశాను." మాటలు అపి తొనలోని ముత్యాలను పెదాలతో సుతారంగా లాగి తింటూ మళ్ళీ అంది. "మీరు కోరమాండల్ ఫెర్టిలైజర్స్‌లో పని చేస్తున్నారు. అవునా?"

నాకు మతి పోయినంత పనైయింది! కవిత ఇంతకు ముందే నన్ను ఎప్పుడో కలుసుకుని ఉండాలి! కాని నాకు గుర్తుకు రావటం లేదు! నా మరపును అసరా చేసుకుని ఆమె తెలివితేటల్ని ప్రదర్శిస్తూంది. ఆ తెలివి తేటలకు ఆనకట్ట వెయ్యాలనుకున్నాను.

"కాదు!" అన్నాను బింకంగా.

"మీ చేతికున్న రిస్ట్‌వాచి చూసుకోండి." అంది రుమాలుతో చేతులు ఒత్తుకుంటూ. మా కంపెనీ వాళ్ళు బహుమతిగా ఇచ్చిన ఎలక్ట్రానిక్ వాచి అది. డయల్ మీద చిన్న సైజులో కంపెనీ "లోగో" పేరు ముద్రించ బడి ఉన్నాయి.

దొరికి పోయాను. కాని బయట పడకుండా చిరునవ్వు నవ్వుతూ "ఈ వాచీ మా రూమ్మేటుది. నాదికాదు." అన్నాను.

"మరి, ఆసూట్‌కేసు సంగతో?" అడిగింది కళ్ళు తమాషాగా చక్రాల్లా తిప్పుతూ.

నా అరిస్టోక్రాట్ సూట్‌కేసు ఫోల్డర్‌లో కంపెనీ ముద్ర ఉన్న కార్డు ఉంది. కార్డు మీద ఇంకా నా పేరు రాయలేదు. అదృష్టంకొద్దీ.

"అదీ మీ రూమ్మేటుదేనా??" అంది.

"అవును. అదీ వాడిదే." అన్నాను.

నా సమాధానంవిన్నాక ఆమె పడీపడీ నవ్వటం ప్రారంభించింది

"మీరూ, మీ రూమ్మేటూ అపూర్వ సహోదరుల్లా ఉన్నారు. ఆయన పేంటుకూడా మీకు సరిగా అతికినట్టు సరిపోయింది." అంది నవ్వాపుకుంటూ.

"అంటే మీ ఉద్దేశం?" అన్నాను రోషంగా.

"మీరు మంచినీళ్ళకు దిగుతూ ఉంటే చూశాను—మీ పేంటు వెనుకపాకెట్ మీద కంపెనీ ఎంబ్లమ్ కుట్టబడి ఉంది"అంది.

నాకు జుత్తు పీక్కోవాలనిపించింది! ప్రయాణం వేళకు చాకలి బట్టలు తెస్తానని దగా చేశాడు. గత్యంతరంలేక డ్యూటీకి వాడే పేంటు వేసుకుని బయలుదేరాను. కానీ ఇన్ని అబద్ధాలు ఆడి మెట్లెక్కి పోయాక ఇక దిగదలుచుకోలేదు!

"నాకూ. మా రూమ్మేటుకూ ఎలాంటి అరమరికలు లేవు! మేమిద్దరం సరిగ్గా ఒకేలా ఉంటాం!" అన్నాను.

ఆమె నవ్వును పెదాల వెనకి బిగబట్టి "మీ రూమ్మేటుకు బదులు అతని కంపెనీ ఉద్యోగంకూడా మీరే చేస్తారా" అని అడిగింది.

"అదేం లేదులెండి! ఉద్యోగులు కాని వాళ్ళను ఆ కంపెనీ చాయ ల్లోకి కూడా రానివ్వరు! కనీసం కంపెనీ బస్సుకూడా ఎక్కనివ్వరు!" అన్నాను.

"నిజంగానా?" ఆమె గొంతు నిండా కొంటెతనం!

"నిజం!" అన్నాను.

"ఆ కంపెనీ షిఫ్టు బస్సులు ఉదయం ఆరుంపావుకి, రాత్రిపదింపావుకి, మధ్యాహ్నం రెండుపావుకి. రాత్రి పదింపావుకి రైల్వే క్వార్టర్సు మధ్యలోంచి వెళతాయి కదా. ఈ మధ్య బోలెడుసార్లు మిమ్మల్ని ఆ బస్సులో చూశాను. కుడి వైపు ముందునుంచి మూడో సీట్లో కిటికీదగ్గర మీరు సాదారణంగా కూర్చుంటూ ఉంటారు." మాటలు ఆపి చిరునవ్వు నవ్వి"అబద్ధం ఆడితే అతికినట్లుండాలి." అంది.

నేను నీరుకారిపోయాను ఇక సాధం లేదు. దొరికిపోయాను.

నడుస్తున్న రైలోంచి దూకి ఆత్మహత్య చేసుకోవాలన్నంత బాధ కలిగింది.

ఆమె పరిశీలనాశక్తికి, తెలి తేటల్ని ప్రదర్శించే ధోరణికి, మాట నేర్పుకూ ముగ్ధుణయ్యాను.

"తమాషాకి అబద్దం ఆడాలనుకున్నాను. కాని నేనేవోడిపోయాను" అంటూ ఏడవలేక ఒక నవ్వు ముఖానికి పులుముకున్నాను.

మా సిఫ్టుబసు రైల్వే క్వార్టర్సు మధ్యనుంచి సాగిపోయేటప్పుడు ఎప్పుడో ఈ అందమయిన ముఖాన్ని చూసి ఉంటాను. అందుకే నాకు ఆమె పరిచయమయిన వ్యక్తిలా అనిపించింది. అయితే బస్సులో నన్ను చూసి జ్ఞాపకం పెట్టుకుని, పరోక్షంగా నన్ను గమనిస్తున్నందుకు మాత్రం కించిత్ గర్వంలాటిది కలిగింది.

ఆమె ఎడల అభిమానంకూడా పెరిగింది.

"మీనాన్నగారు రైల్వేలో పనిచేస్తున్నారా?" అడిగాను.

"మా నాన్నగారులేరు! మా అన్నయ్య సికింద్రాబాద్‌లో కంట్రాక్టరు. మా పరీక్షలు అయిపోయాక సెలవుల్లో మా బాబాయిగారింటికి వచ్చాను. ఆయన రైల్వేగార్డు! ఇంకో నెల్లాళ్ళు విశాఖపట్నంలో ఉండాలనుకున్నాను. కాని మా వదినెకు ఒంట్లో బాగులేదని, తొందరగా బయలుదేరి వచ్చెయ్యమనీ మా అన్నయ్య ఉత్తరం రాశాడు. అందుకని, మా

పిన్నికోసం రిజర్వుచేయించిన టిక్కెట్టుమీదే నేను బయలుదేరాను" అంది.

అంతలో రైలు అనకాపల్లి ప్లాట్ ఫారంమీద ఆగింది.

"కాఫీ తాగుదామా?" అన్నాను చొరవగా.

"తప్పకుండా. కాని నేను "పే" చేస్తాను." అందామె హాండ్ బాగ్ లోంచి డబ్బుతీస్తూ.

"నో! నో! అలావీల్లేదు." అన్నాను.

"అయితే ఒకపని చేద్దాం! బొమ్మా, బొరుసూవేద్దాం. మీ కేం కావాలి?" అంది.

"బొమ్మ!" అన్నాను.

"బొమ్మపడితే మీరు హైదరాబాద్ వెళ్ళేవరకూ ఖర్చులన్నీ భరించాలి. బొరుసుపడితే నేను భరిస్తాను. మీరు కాదనకూడదు." అంటూబాగ్ లోంచి ఒకకొత్త నాణెం బయటకు తీసింది. తరవాత పిడికిలి బిగించి "నేను బయటకు తీసిన నాణెం ఏమిటో చెప్పండి-చూద్దాం" అంది.

"కొత్త రూపాయి నాణెం" అన్నాను.

"ఊహూ. కాదు" అంది.

"నేను స్పష్టంగా నాకళ్ళతో చూశాను! సైజునిబట్టి పోల్చలేనని అనుకోకండి" అన్నాను.

"కళ్ళుకూడా ఒక్కొక్కప్పుడు అబద్దాన్ని నిజంగా భ్రమింపజేస్తాయి. కాదు—మన కళ్ళనికుడా మనం నమ్మలేకుండా చేసేస్తున్నారు మహారాజశ్రీ మన ప్రభుత్వం వారు. ఇదిగో-చూడండి" అంటూ పిడికిలి విప్పి నాకళ్ళ ఎదురుగా ఉంచింది.

అది రెండు రూపాయల నాణెం.

"ఆసియా క్రీడోత్సవాల సందర్భంగా మొన్ననే ఈ ప్రత్యేక నాణెం విడుదల చేశారు. దానికి కొన్ని కోట్లరూపాయలు ఖర్చయిపోయింది కదా-అందుకని రెండు రూపాయల నాణేన్ని రూపాయిసైజుకి

తెచ్చారు. దిగజారిపోతున్న మన ఆర్థిక వ్యవస్థకి సింబాలిక్‌గా ఉంది కదూ ఇది?" అంది.

"బాగా ఎనలైజు చేశారు." అన్నాను మెచుకోలుగా.

"సరే, మీరు బొమ్మ చెప్పారు కదూ." అంటూ నాణెం ఎగరేసి అరచేతితో పట్టుకుంది.

బొమ్మ పడింది! "లక్కీ ఫెలో! మీరే గెలిచారు." అంటూ రెండు రూపాయల బిళ్ళని బాగ్‌లో పడేసింది.

"లక్ విషయంలో మనకెన్నడూ అడ్డులేదు." దర్పంగా అంటూ కాఫీలు తీసుకున్నాను. తాగటం ముగించి అదరా బాదరా గ్లాసులు కదులుతున్న రైల్లోంచి బయటకు అందించాం.

"రాత్రి డిన్నర్ రాజమండ్రిలో తిందాం" అన్నాను. ఆమె మీద నాకేదో కొత్తగా హక్కు ఏర్పడినట్లనిపించింది.

"ఒకటే భోజనం అర్డరు చేయండి! నా దగ్గర పులిహోర ఉంది! రెండూ కలిపి వన్‌బైటూ తిందా" అంది.

నాకు ఇదంతా కలలో జరుగుతున్న దృశ్యానికి మల్లే అనిపిస్తూంది! అసలు అరమరికలు లేకుండా చనువుగా, తెలివిగా, చిలిపిగా ప్రవర్తించే కవిత ఎడల ఏదో ఆకర్షణ ఆరంభమయింది. ఆమె సాహిత్యం ఎప్పటికీ-జీవితకాలమంతా- పొందితే ఎంతో బాగుంటుందనిపించింది. నాకు రెండు వేల రూపాయలు లభించే పెర్మనెంటు ఉద్యోగం ఉంది! ఏ బాదరబందీ లేదు! ఈమెను పెళ్ళి చేసుకుంటే... జీవితం ఎంత మధురంగా ఉంటుంది.

ఆ ఆలోచన మనసులోకి వచ్చేసరికి గుండె దడదడ లాడింది!

"మీరు హైదరాబాద్‌లో ఎన్నాళ్ళుంటారు?" నిశ్శబ్దాన్ని చీలుస్తూ అడిగింది.

"నాకు స్కూటర్ "ఎలాట్" అయింది. తీసుకుందామని వెళుతున్నాను. రేపు ఆదివారం దాకా పనికాదు! సోమవారం తీసుకుని ఆ రాత్రి గోదావరిలో తిరిగి విశాఖపట్నం వచ్చేస్తాను."

"హైదరాబాద్‌లో ఎక్కడుంటారు?" అంది.

"మలక్‌పేటలో మా అక్కయ్యగారిల్లుంది, అక్కడే ఉంటాను! మరి మీ సంగతో?" అడిగాను.

"సికిందరాబాద్ ప్లాజా దగ్గరలో ఉంటున్నాం" అంది.

రైలు ఏదో బ్రిడ్జిమీద వెళుతోంది! దడదడమంటూ ఒకటే శబ్దం! మామధ్య మాటలు ఆగిపోయాయి. సీటులోని పాత మేగజైను తీసి చదవటం ఆరంభించాను. కొద్దిసేపట్లో అందులో లీనమయిపోయాను!

* * *

రాజమండ్రిలో భోజనాలు ముగించాం ఇద్దరం. చేతులు కడుక్కుని వచ్చేసరికి అయ్యంగార్ కింది బెర్తులో తన పక్కబట్టలు పదిలంగా సర్దినడుం వాల్చేరు! మధ్య బెర్తుమీద కవిత పక్క పరుచుకుంది. నేను పై బెర్తు మీదికి వెళ్ళిపోయాను.

పదినిమిషాల్లో అయ్యంగారూ, కేస్కర్ కుటుంబమూ నిద్రలోకి జారిపోయారు.

"మీకు లైటు ఆర్పేస్తే అభ్యంతరమా?" అడిగింది కవిత.

"ఆర్పెయ్యండి! ఏమాత్రం వెలుతురున్నా నాకు నిద్ర పట్టదు!" అన్నాను ఆవులిస్తూ.

నీలం బల్బుతో సహా అన్నీ ఆర్పేసింది కవిత. మసక వెలుతురు మా మధ్య మిగిలింది. బోర్లా పడుకుని ముఖం కాస్త పక్కకు పెట్టి కిందకు చూశాను.

సరిగ్గా నాకు రెండు అడుగుల దూరంలో, కవిత వెల్లకిలా పడుకుని నాకేసి చూసి నవ్వుతూంది. ఆమె జడలోని మల్లెచెండు బెర్తుకిందికి వేలాడుతూంది! విసురుగా పడేసిన జడ అస్తవ్యస్తంగా చుట్టుకున్న నల్లతాచులా ఉంది!

"కవితా!" అస్పష్టంగా గొణిగాను.

"నిద్ర రావటం లేదా?" చిరునవ్వుతో అడిగింది.

“ఎలా వస్తుంది” అనాలనుకున్నాను. కాని సభ్యత కాదని వూరుకుని “ఉహూ!” అని మాత్రం అన్నాను.

“జోల పాడమంటారా? నవ్వుతూంది ఇంకా.

ఆమెవంక కన్నార్పకుండా చూస్తూ మవునంగా వుండిపోయాను.

ఆమె నావంక ఒక నిమిషంపాటు చూసి తరవాత కళ్ళు మూసుకుంది. కొద్దిసేపట్లో ఆమె నిద్రలోకి జారిపోయిందని గ్రహించాను.

మెల్లగా నా చేతిని కిందకు దించి ఆమె జడమీద సుతారంగా రాశాను. తరవాత మెల్లగా చూపుడు వేలుని ఆమె బుగ్గమీద కదిలించాను. ఆమెకు మెలకువ రాలేదు! “లేచి గొడవ చేస్తేనో!” భయంతో చెయ్యి వెనక్కి తీసుకున్నాను.

చాలా సేపటివరకూ నిద్ర పట్టలేదు నాకు! నిద్రలోకి జారిపోయే ముందు ఆమె బుగ్గమీద అన్చిన నా చూపుడు వేలుని నేను ముద్దు పెట్టుకున్నట్లు లీలగా గుర్తుంది!.

* * *

ఎవరో తట్టినట్లయి తెలివి వచ్చింది!

“లేవండి సికింద్రాబాద్ వచ్చేస్తూంది.” అంటూ లేపింది కవిత.

బద్ధకంగా లేచి పై బెర్తుమీద నుండి దిగాను. అప్పటికే ఆమె సామాన్లన్నీ సర్దేసింది.

“మా మేనల్లుడు నాంపల్లి స్టేషనుకు వస్తాడు. నేను అక్కడ దిగుతాను” అన్నాను దుప్పటి మడతబెడుతూ.

సికిందరాబాద్ ప్లాట్‌ఫారం మీద రైలు ఆగింది.

“థాంక్యూ ఫర్ ది నైస్ కంపెనీ!” అంది కవిత కృతజ్ఞతాపూర్వకంగా నా వంక చూస్తూ.

“ఆ మాట నేను చెప్పాలి!” అన్నాను.

చిన్న కాగితం మీద మా అక్కయ్యగారి ఇంటి చిరునామా, ఫోన్

నంబరు రాసి అందిస్తూ అన్నాను. "కవితా! మనిద్దరం స్నేహితుల మయ్యాం! సాయంకాలం బిర్లామందిర్‌కు రండి, మీ కభ్యంతరం లేక పోతే! సరదాగా ఒక అరగంట కబుర్లు చెప్పుకుందాం!" అన్నాను.

"తప్పకుండా వస్తాను! ఇదిగో ఇది మా అన్నయ్య ఫోన్ నంబరు అంటూ నాకు నంబరు రాసి ఇచ్చింది.

"ఈ వేళ సాయంకాలం అయిదు గంటలకు నాకు ఫోన్ చేయండి! అప్పుడు బిర్లా మందిర్ ప్రోగ్రాం ఫిక్స్ చేసుకుందాం!

"థాంక్స్!" అన్నాను. సామానులు లైసెన్సు కూలీకి అప్పగించి బయలుదేరింది కవిత. నా సామానులు కాస్త చూడమని అయ్యంగారితో ఇంగ్లీషులో చెప్పి కవితను సాగనంపటానికి కంపార్ట్‌మెంట్ దిగాను.

"మీకో సమస్య చెబుతాను. ఆలోచించి సాయంకాలం మనం కలిసినప్పుడు సమాధానం చెప్పండి!" నవ్వుతూ అంది కవిత.

"తప్పకుండా" అన్నాను.

"రెండు మగచీమలు, ఒక ఆడచీమ ఒకదాని వెనక ఒకటి వెళ తున్నాయి. ముందున్న మగచీమ, "నా వెనక మగచీమ, ఒక ఆడచీమ ఉన్నాయి" అంది. దానివెనకాల ఉన్న మగచీమ, "నా ముందు ఒక మగ చీమ, వెనక ఒక ఆడచీమా ఉన్నాయి" అంది. ఆఖరున ఉన్న ఆడచీమ మాత్రం "నాముందు మూడు మగచీమలున్నాయి"అంది. ఆడచీమ అలా ఎందుకంది? ఆలోచించి చెప్పండి!" అంది.

"సాయంకాలం మనం కలుసుకుంటున్నాంకదూ!" అంటూ చేయి వూపుతూ కదిలిపోయింది. కాళ్ళీడ్చుకుంటూ కంపార్టుమెంటుకు చేరు కున్నాను.

* * *

మధ్యాహ్నం రెండు గంటలయింది. చీమల సమస్యతో ఉదయ మంతా తల కొట్టుకున్నాను. కాని సమాధానం దొరకలేదు. "సాయంకాలం ఎప్పుడవుతుందా?" అని నిమిషాలు లెక్కపెడుతున్నాను. అంతలో నే మా

అక్కయ్యగారి అయిదేళ్ళ పాప బత్తాయిపండు పట్టుకొచ్చి "మామయ్యా, తొనలు ఒలిచి పెట్టవూ?" అంటూ దగ్గరకు చేరింది.

ఆమె దగ్గర పండు తీసుకొని గబగబా ఒలిచి తొనలు లెక్క పెట్టాను. పదకొండు వున్నాయి.

నా కేదో అనుమానం వచ్చింది! త్వరితంగా లేచివెళ్ళి కవిత ఇచ్చిన నంబర్‌కు ఫోన్ చేశాను.

"హలో! హనుమాన్ ఎంటర్‌ప్రైజెస్" అంది అవతలి కంఠం.

'కవితగారు ఒక్కసారి కావాలి!" అన్నాను ఆదుర్దాగా.

"ఇక్కడ ఆ పేరుతో ఎవ్వరూ లేరు! ఇది షామియానాలు సప్లయి చేసేషాపు!" అంది అవతలి గొంతు.

"ఈవేళ ఉదయం విశాఖపట్నంనుంచి వచ్చారు! వారి అన్నయ్య కంట్రాక్టరు! దయచేసి చెక్ చెయ్యండి" అన్నాను.

"సారీ సార్! ఆ పేరుతో ఎవరూ లేరు! అంటూ టక్కున ఫోన్ పెట్టేశాడు అవతలి వ్యక్తి.

నాకు మతి పోయినట్లయింది! డైరెక్టరీ తీసి హనుమాన్ ఎంటర్‌ప్రైజెస్ నంబరు చూశాను. నావద్దనున్న నంబరుతో సరిపోయింది! అంటే నంబరు సరిగ్గానే కనెక్టయింది. కవిత రాంగ్ నంబర్ ఇచ్చిందా? లేక పొరపాటు రాసిందా?

ఎడతెగని ఆలోచనలు మనసును చుట్టుముట్టాయి. అయిదు గంటల వరకూ ఫోన్ దగ్గరే గడిపాను! అటునుండి కూడా "కాల్" రాలేదు!

ముఖం కడుక్కుని, బట్టలు వేసుకుని బిర్లామందిర్ వెళ్ళాను! రాత్రి తొమ్మిది గంటలవరకూ అనుక్షణం కవితకోసం గడిపాను! ఆమె రాలేదు.

ఇంటికి తిరిగివచ్చి పడుకునేసరికి గంట పదకొండున్నర అయింది కవిత మోసం చేసిందా? ఏమో! ఏమీ అర్థంకాలేదు.

* * *

ఒక పెద్ద హాలులో కూర్చుని నేను బత్తాయిపళ్ళు అతి వేగంగా ఒలుస్తున్నాను. ఒలిచినవి సుమారు అయిదువందల పళ్ళు ఒక గుట్టగాపడి వున్నాయి. నాచుట్టూ బత్తాయితొక్కలు! ఇంకా ఒలవాల్సినవి సుమారు వెయ్యిపళ్ళు నా వెనక కొండలా పడివున్నాయి. అంతలోనే కవితవచ్చింది గలగల నవ్వుతూ. "అనవసరంగా పళ్ళన్నీ ఒలిచి పోగులు పెట్టకండి! జరిగిన సంగతి చెప్పనా? మీరు మంచినీళ్ళకు రైలు దిగినప్పుడు పండు కింది భాగంలో కొంచెం ఒలిచి తొనలు లెక్కపెట్టాను. మీకాభాగం కన బడకుండా అరచేతితో మూసి పండు చూపించాను! మీరు నా వేళ్ళ అందం మాత్రమే చూస్తారనీ, పండుని గమనించరనీ నాకు తెలుసు" అంది.

"అన్యాయం! మోసం చేశావు నువ్వు!" దాదాపు అరిచినంత పని చేశాను.

అంతలోనే కల చెదిరిపోయి తెలివివచ్చింది. కిటికీలోంచి ఎండ పొడ సన్నగా గదిలో పడుతూంది.

* * *

స్కూటర్ డెలివరీ తీసుకుని ఇంటికి వచ్చాను గోదావరి ఎక్స్ ప్రెస్‌కు ఇంకా మూడుగంటలు మాత్రమే సమయముంది. పార్శెల్ ఆఫీసు దగ్గర స్కూటర్ బుక్‌చేయటం పెద్ద తతంగం! బాగా ముందుగా బయలు దేరితేకాని పని పూర్తికాదు!

ఆదరాబాదరా సామానులు సర్దుకుంటున్నాను.

ఆ సమయంలో ఫోన్ మోగింది.

అక్కయ్య ఫోన్ ఎత్తి "పిలుస్తాను, ప్లీజ్ హోల్డ్ ది లైన్" అని "కృష్ణా! నీకు ఫోన్‌కాల్" అంటూ కేక పెట్టింది డ్రాయింగ్ రూంలోంచి

గుండె దడదడ లాడింది! సందేహం లేదు కవిత!

ఆనందంతో గబగబా వెళ్ళి రిసీవర్ అందుకున్నాను.

"హలో! కృష్ణా స్పీకింగ్!" అన్నాను. నా గొంతు నాకే వింతగా ధ్వనించింది.

"నమస్తే కవితను!" అంది.

"అదేమిటి! కవితా, అలా చేశావేమిటి? నీ ఫోన్‌కోసం నిన్న సాయంత్రమంతా ఎలా ఎదురు చూశానో తెలుసా? నేను రింగ్ చేస్తే అదేదో షాపుకు వెళ్ళిపోయింది కాల్. నీ అడ్రసేమిటి? ఈవేళ సాయం కాలం బిర్లామందిర్‌కు వస్తావా? నువ్వొస్తానంటే ప్రయాణం కాన్సిల్‌చేసు కుంటాను. నీతో చాలా మాట్లాడాలి." ఇలా ఎన్నో మాటలు నాలుకమీద దొర్లి పెదాలకిందే ఆగిపోయాయి.

'నమస్కారం' అన్నాను గొంతు సవరించుకుంటూ.

"మీకిచ్చిన సమస్యకు సమాధానం తెలిసిందా?" ఆమె చిలిపి గొంతు చెవుల్ని కాల్చేస్తూంది.

"లేదు!" అన్నాను.

"క్షమించండి! ఆడచీమ ఒట్టి అబద్దాలకోరు!" అంటూ రిసీవర్ పెట్టేసింది.

(ఆంధ్రప్రభ 11-1-1984)